పైరవీలు

- బదిలీల కోసం మంత్రి, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ఉద్యోగులు
- సామాజికవర్గాలు, బంధుత్వాల ద్వారా రికమండేషన్లు
- అనుకూలురైన ఉద్యోగుల కోసం నేతల అన్వేషణ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారపగ్గాలు చేపట్టడంతో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు బదిలీల కోసం ముమ్మర యత్నాలు చేస్తున్నారు. కూటమికి చెందినమంత్రి, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు అప్పుడే ప్రదక్షిణలు ప్రారంభించారు. తమకు అనుకూలమైన ప్రాంతాల్లో ఉద్యోగాలు పొందేందుకు ఎక్కడెక్కడో పనిచేస్తున్న ఉద్యోగులు పొలిటికల్ లాబీయింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్‌అండ్‌బీ, పోలీసు శాఖలతో పాటు వ్యవసాయ, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు ఆయా నియోజకవర్గాల్లో ఉద్యోగాల కోసం నేతల నుంచి హామీలు పొందుతున్నారు. త్వరలోనే కొందరికి స్థానచలనం కలిగే అవకాశాలు ఉన్నాయి.

బదిలీల కోసం ఉద్యోగుల పాకులాట

జిల్లాలో కొందరు ఉద్యోగులు తమకు అనువైన ప్రాంతంలో పోస్టింగ్‌లు సాధించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా నుంచి రామచంద్రపురం ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్‌కు కార్మిక శాఖ మంత్రి పదవి దక్కింది. దాంతో జిల్లాలో బదిలీల వ్యవహారం మంత్రి, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉద్యోగాల కోసం ఉద్యోగులు పైరవీలకు దిగుతున్నారు. తమకు అనుకూలమైన పోస్టుల కోసం కొందరు కీలక అధికారులు అప్పుడే అమరావతి వెళ్లి వివిధ ప్రాంతాలకు చెందిన మంత్రుల వద్ద మాటలు తీసుకునే పనిలో కూడా ఉన్నారు. ముఖ్యంగా పోలీసు శాఖలో సీఐలు, ఎస్ఐలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ ఇంజనీరింగ్ శాఖల ఏఈలు, డీఈలు... ఇలా అనేక శాఖల్లోని కీలక ఉద్యోగులు తమకు అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టులు పొందేందుకు అన్ని రకాల ప్రయత్నాలూ ప్రారంభించారు. ఈ నెల 12న మంత్రివర్గ ప్రమాణ స్వీకారం పూర్తయిన తర్వాత నుంచీ లాబీయింగ్‌లు మరింత పెరిగాయి. ఆయా శాఖల ఉద్యోగులు, బంధువర్గీయులతరఫున మరికొందరు ఉద్యోగులు పోస్టింగ్ ఎక్కడ అయితే బాగుంటుందో చూసుకుంటున్నారు. ఇప్పటికే కొందరు ఆయా స్థానాలకు వెళ్లి ఎంక్వైరీలు కూడా చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు, తహసీల్దార్లు బదిలీపై వచ్చారు. తిరిగి వారంతా ఆయా జిల్లాలకు త్వరలోనే వెళ్లనున్నట్టు సమాచారం. ఇప్పటికే ఎస్ఐలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలను తమకు అనుకూరులైన వ్యక్తులను నియమించుకోవడంపైనా ఎమ్మెల్యేలు సైతం దృష్టిసారించారు. ఈ నెలాఖరులోగా కీలక ఉద్యోగులకు స్థానచలనం కలగనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

ఇక పోలవరం పరుగులు





ముస్తాబవుతున్న పోలవరం ప్రాజెక్టు ప్రాంతం... ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



నేడు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు చంద్రబాబు

- సీఎం హోదాలో తొలి పర్యటన
- ఉదయం 11.30 గంటలకు రాక
- సాయంత్రం 4 గంటల వరకూ ఇక్కడే
- ప్రాజెక్టులో అణువణువూ పరిశీలన
- నాడు 72 శాతం పనులు పూర్తి
- నేటికీ అక్కడే పోలవరం ప్రాజెక్టు
- వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం
- బ్యారేజీగా మార్చిన వైనం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పోలవరం ప్రాజెక్టుకు మళ్లీ కళొచ్చింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో గోదావరిపై నిర్మించే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై అంచనాలు రెట్టింపయ్యాయి. గత ప్రభుత్వంలో సోమవారం పోలవారం అని ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్టు సందర్శించి చంద్రబాబు పరుగులు పెట్టించిన సంగతి తెలిసిందే. 2019 నాటికి ఆయన 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తిచేశారు. కానీ అప్పట్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు చతికిలపడింది. దీనిని మళ్లీ గాడిలో పెట్టడానికి కూటమి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి పర్యటనగా పోలవరం రానున్నారు.

నాడు ప్రాజెక్టు పనుల పరిస్థితి ఇదీ

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి స్పిల్‌వే పనులు పూర్తయ్యాయి. హెడ్‌వర్క్స్ పనులు 72.63 శాతం, కుడి ప్రధాన కాలువ పనులు 92.75 శాతం, ఎడమ ప్రధాన కాలువ పనులు 73.07 శాతం, భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు 22.55 శాతం మాత్రమే అయ్యాయి. స్పిల్‌వే రేడియల్ గేట్ల అమరిక పూర్తయింది. రెండు కాఫర్ డ్యామ్ పనులు సుమారుగా పూర్తయ్యాయి. ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌కు సంబంధించి గతంలో డయాఫ్రంవాల్ నిర్మాణం పూర్తి చేశారు. మరమ్మతులు చేస్తున్నారు. స్పిల్ ఛానల్ పనులు 88 శాతం, అప్రోచ్ ఛానల్ పనులు 79 శాతం, పైలట్ ఛానల్ పనులు 48 శాతం, లెఫ్ట్ అండ్ రైట్ అనుసంధాన పనులు 68 శాతం పూర్తయ్యాయి. చంద్రబాబు రాకతో ప్రాజెక్టుతో పాటు అన్ని పనులు చకచకా పరుగులు తీయనున్నాయి. సీఎం చంద్రబాబు సోమవారం ఉదయం 11 గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటల వరకూ ఇక్కడే ఉండనున్నారు.

చంద్రబాబు రాకతో ముస్తాబు...

ఇంతకాలం నిర్లక్ష్యానికి గురైన పోలవరం ప్రాజెక్టు ప్రాంతం చంద్రబాబు రాక సందర్భంగా మూడు రోజులుగా ముస్తాబవుతోంది. పోలవరం ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాపన చేసిన శిలాఫలక స్థూపం వైసీపీ నిర్లక్ష్యం వల్ల తుప్పలతో నిండిపోయింది. దానిని శుభ్రం చేసి అధికారులు అందంగా తయారు చేశారు. స్పిల్‌వే దగ్గర నుంచి ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రంవాల్ నిర్మించిన గోదావరి ప్రాంతం, పవర్ ప్రాజెక్టు నిర్మిస్తున్న ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు వీలుగా దారి ఏర్పాటు చేసి టెంట్లు వేశారు.

ఐదేళ్లూ వైసీపీ ఏం చేసింది...

వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ దిక్కూమొక్కూ లేకుండా ఈ ప్రాజెక్టు పడి ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పూర్తయి నీటితో కళకళలాడవలసిన ప్రాజెక్టు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. అప్పట్లో చంద్రబాబు స్పిల్‌వే పనులు సుమారు పూర్తి చేసి గేటు కూడా పెట్టిన సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం వచ్చి ఆ పనిని మాత్రమే కొనసాగించి మిగతా వాటిని నిర్లక్ష్యం చేసింది. స్పిల్‌వే పూర్తయినా ప్రధాన కాలువలు పూర్తి కానందున కనీసం గ్రావిటీ ద్వారా కూడా స్పిల్‌వే నుంచి ప్రధాన కాలువలకు నీరు పంపే పరిస్థితి కూడా లేదు. ప్రధాన డ్యామ్ అయిన ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) పూర్తి చేసి కుడి ప్రధాన, ఎడమ ప్రధాన కాలువల పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తే ఈ ప్రాజెక్టుకు ఒక రూపు వచ్చేది. కానీ కేవలం బ్యారేజీలా తయారు చేశారు. వరద నీటిని కొంత ఆపి మళ్లీ సముద్రంలోకి వదలడానికి తప్ప ఎందుకూ కొరగాని ప్రాజెక్టుగా ఉండిపోయింది. 2019 ఎన్నికల ముందు టీడీపీ హయాం లో ప్రాజెక్టు పనులు చూడడానికి వేలాదిగా సందర్శకులు వచ్చేవారు. వందలాది యంత్రాలతో పనులు జరుగుతుం డేవి. ప్రజలు ఎంతో ఆనందపడేవారు. వైసీపీ ప్రభుత్వం కేవలం రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్య ఇసుక ఫిల్లింగ్ ఓ మాదిరిగా చేస్తూ దానిని రెండు యంత్రాలతో వైబ్రో కాంపాక్షన్ చేసే పని మాత్రం కొంతవరకూ చేశారు. ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్వహణ వదిలేయడం వల్ల ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి లీకులు ఏర్పడ్డాయి. లీకవుతున్న నీటిని తోడి బిల్లులు చేసుకోవడానికే ప్రాధాన్యమిచ్చారు. ప్రధాన డ్యామ్ అయిన ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌పూర్తయితేనే పోలవరం ప్రాజెక్టు రిజర్వాయరు నిర్మించినట్టు అవుతుంది. కానీ దీని నిర్మాణానికి గోదావరి నదిలో నిర్మించిన డయాఫ్రంవాల్ విషయంలో రాజకీయం చేశారు. 2022మేలో ఇక్కడ కావాలని గొయ్యిపెట్టి డయాఫ్రంవాల్ దెబ్బతిన్నట్టు రాజకీయం చేశారని కూడా విమర్శలు ఉన్నాయి. గోదావరికి అడ్డంగా ఎగువ కాఫర్ డ్యామ్‌ను ఉద్దేశపూర్వకంగా కొంత ఎత్తు పెంచడంతో ఫారెస్ట్‌లోని గ్రామాలు, పాపికొండలు ప్రాంతం బాగా మునిగిపోతుంది. పునవాసం కల్పించకుండా గత ప్రభుత్వం అనేక ముంపు గ్రామాల ప్రజలను ముప్పుతిప్పలు పెట్టింది. 2021కే పూర్తి కావలసిన ఈ ప్రాజెక్టు గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికీ పూర్తి కాలేదు.

పర్యటన ఇలా...

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం ఉదయం 11 గంటలకు అమరావతి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.30 గంటలకు పోలవరం చేరుకుంటారు. 11.35 నుంచి 11.45 గంటల వరకు స్థానిక నాయకులు ఆయనకు స్వాగతం పలుకుతారు. 11.55కి హెలిప్యాడ్ వద్ద వ్యూ పాయింట్‌కు చేరుకుంటారు. గైడ్ బండ్, గ్యాప్-3, ఎగువ కాఫర్, గ్యాప్-1, గ్యాప్ -2, దిగువ కాఫర్ డ్యామ్, పవర్‌హౌస్ పనులను పరిశీలిస్తారు. 1.15 గంటలకు గెస్ట్‌హౌస్‌కు చేరుకుని మధ్యాహ్నం 2 గంటలకు లంచ్ చేస్తారు. అనంతరం 2.05 నుంచి 3.05 గంటల వరకు అధికారులతో ప్రాజెక్టుపనులపై సమీక్షిస్తారు. 3.10 గంటల నుంచి 3.40 గంటల వరకు విలేకరులతో మాట్లాడి 4 గంటలకు అమరావతి బయలుదేరతారు.

మంత్రి సుభాష్‌కు ఘన స్వాగతం



రావులపాలెంలో మంత్రి సుభాష్‌కి ఘన స్వాగతం పలుకుతున్న కొత్తపేట అసెంబ్లీ విజేత బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్



రామచంద్రపురంలో టీడీపీ, జనసేన కూటమి కార్యకర్తల ఆనందోత్సాహాలు

కార్మిక శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారిగా రామచంద్రపురం నియోజకవర్గానికి విచ్చేసిన వాసంశెట్టి సుభాష్‌కు ఆదివారం ఘన స్వాగతం లభించింది. కోనసీమ ముఖద్వారమైన రావులపాలెంలో సాయంత్రం ఐదు గంటలకు మొదలైన విజయోత్సవ ర్యాలీ జొన్నాడ, ఆలమూరు, మండపేట, పులగుర్త, మాచవరం మీదుగా రామచంద్రపురం చేరేసరికి రాత్రి తొమ్మిది గంటలు దాటింది. మంత్రి సుభాష్‌కు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అడుగడుగునా గజమాలలు వేసి ఘన స్వాగతం పలికారు... 5లో



రామచంద్రపురంలో ఆదివారం రాత్రి విజయోత్సవ ర్యాలీలో అభిమానులకు అభివాదం చేస్తున్న మంత్రి సుభాష్

నెరవేరని అమృత లక్ష్యం

- ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కేంద్ర ప్రాజెక్టు
- సరోవర్ ప్రాజెక్టులో 73 చెరువుల అభివృద్ధి
- రెండు చెరువులకు మాత్రమే రివిట్‌మెంట్
- 11 చెరువుల గట్లపై ప్లాంటేషన్
- హడావుడిగా పనులు
- యథాస్థితిలోనే దర్శనమిస్తున్న చెరువులు



సూదాపాలెంలో అమృత సరోవర్ చెరువు

ఉప్పలగుప్తం, జూన్ 16: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అమృత సరోవర్ ప్రాజెక్టు లక్ష్యం ఎంతో మహత్తరమైనది. ఇది పూర్తయితే బహుళ ప్రయోజనాలు చేకూరతాయని ప్రజలు ఆశించారు. గ్రామాల్లో పూర్వం నుంచీ అనేక చెరువులు ప్రజలకు, పశువులకు దాహం తీరుస్తున్నాయి. ఈ చెరువుల ఆధారంగానే పంటలు పండించేవారు. క్రమంగా జనాభా పెరుగుదలతో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. మిగిలిన చెరువులు కాలుష్యం, ఇతర వ్యర్థాలతో పూడుకుపోతున్నాయి. పంచాయతీల అధీనంలో ఉన్న ఈ చెరువులను కాలక్రమంలో చేపల పెంపకం నిమిత్తం లీజుకు ఇవ్వడం పరిపాటిగా మారింది. కొన్ని చెరువులు పూర్తిగా కలుషితమై స్థానికుల ఆరోగ్యానికి భంగం కల్గించే పరిస్థితులు దాపురించాయి. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ చెరువులను ఆధునీకరించి అమృత సరోవర్‌లుగా రూపొందించాలని ప్రణాళికా రచన చేసింది. దీని ఫలితమే అమృత సరోవర్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుకు ప్రతి జిల్లాలోనూ కొన్ని చెరువులను ఎంపిక చేశారు. ఉపాధి పథకంలో ఆ చెరువుల్లో పూడికతీసి, చెరువు గట్లను పటిష్టం చేయాలి. గట్లకు రివిట్‌మెంట్ చేయాలి. చెరువుగట్లపై బెంచీలు ఏర్పాటు చెయ్యాలి. మొక్కలు పెంచాలి. తద్వారా చెరువునీరు కలుషితమయ్యే అవకాశాలు తగ్గుతాయి. చెరువు గట్లు పార్కుల్లా ప్రజలకు ఉపయోగపడతాయి. చెరువు గట్లను వాకింగ్ ట్రాక్‌లుగా ఉపయోగించుకునే వీలుంటుంది. చెరువులను ఆధునీకరించిన అనంతరం సమీప భూగర్భ జలాల్లో మార్పు వస్తుంది. గతంలోలా ఉప్పు నీటి, రంగునీటి బోర్లలో స్వచ్ఛ జలాలు లభ్యమవుతాయి. అమృత సరోవర్ ప్రాజెక్టుతో ఇన్ని ఉపయోగాలున్నాయంటే ఆశ్చర్యమే కదా!! లక్ష్యం మంచిదే. అమలులో చిత్తశుద్ధి ఉంటే నూరు శాతం ఫలితం లభించేదే. ఈ ప్రాజెక్టును 2022లో ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 73 చెరువులను ఈ పథకంలో ఆధునీకరించారు. ఈప్రాజెక్టు ప్రారంభంలో చెరువుల్లోని నీటిని యంత్రాలతో బయటకు తోడి ఎండగట్టారు. ఆదిలోనే పనులకు తరచూ అంతరాయం ఏర్పడింది.

చెరువులను ఎండగట్టిన సమయంలో వర్షాలు వచ్చినప్పుడు చెరువులో నీటిని మళ్లీమళ్లీ తోడాల్సి వచ్చింది. చెరువులను ఎండగట్టే పనిని పంచాయతీలకు అప్పగించారు. పదేపదే నీరు తోడాల్సి రావడంతో పంచాయతీలకు వ్యయం తడిసిమోపెడయ్యింది. 2023కల్లా ప్రాజెక్టు పూర్తిచెయ్యాలన్న ఆదేశాలు, అధికారుల్లో లోపించిన పర్యవేక్షణ, చెరువుల ఎంపికలో లోపాలు వెరసి పనులను అంతంతమాత్రంగా చేసి పూర్తయిందనిపించారు. అధికారుల వివరాల ప్రకారం జిల్లాలో 73 చెరువులకు 11చెరువులకు మాత్రమే గట్లపై మొక్కలు, బెంచీలు ఏర్పాటు చేశారు. రెండు చెరువులకు మాత్రమే రివిట్‌మెంట్ జరిగింది. ఏడాదికే సరోవర్ చెరువులు పాతరూపును సంతరించుకున్నాయి. పరిస్థితి తిరిగి మొదటికే వచ్చింది.

ప్రాజెక్టు లక్ష్యం నెరవేరాలంటే.....

ప్రాజెక్టు పరిధిలోని చెరువుల్లో ప్రతిఏటా పూడిక తీయాలి. చెరువు గట్లు ఆక్రమణలకు గురికాకుండా పంచాయతీలు చర్యలు తీసుకోవాలి. స్వచ్ఛంద సంస్థల సహాయంతో గట్లపై బెంచీలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. ప్రతి చెరువు గట్టుకు రివిట్‌మెంట్ చెయ్యాలి. వ్యర్థాలు చెరువుల్లో వేయకుండా కట్టడి చెయ్యాలి. అప్పుడే ప్రతి పంచాయతీ చెరువు ఒక అమృత సరోవరంగా మారుతుంది. ఎక్కడ బోరు వేసినా స్వచ్ఛ జలాలు లభిస్తాయి.



అమృత సరోవర్ ప్రాజెక్టులో భాగంగా గొల్లవిల్లిలో అభివృద్ధి చేసిన చెరువు

తూర్పు అంతా.. ఉచితమే!



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మల్లగుల్లాలు

- త్వరలోనే ఆరంభానికి సన్నాహాలు
- ఉమ్మడి జిల్లాలో 1200 బస్సులు
- ఉచితానికి సరిపోవని అంచనా
- కొత్త బస్సులు కొనాల్సిందే
- ఇతర రాష్ట్రాల్లో పరిశీలన
- ఆర్టీసీ సంఘాల ఆనందం

సామర్లకోట, జూన్ 16: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.. సూపర్ సిక్స్‌లో కూటమి ప్రభుత్వ హామీ.. ఈ హామీ ఎప్పుడు అమలవు తుంది.. ఎలా అమలవుతుందోనని మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు.పథకం సాధ్యాసాధ్యాలపై అధికా రులు మల్లగుల్లాలు పడుతున్నారు.ఇతర రాష్ట్రాల్లో ఎలా అమలు చేస్తున్నారనే దానిపై దృష్టి సారిస్తు న్నారు. ఉమ్మడి జిల్లాలో ఎన్ని బస్సులు ఉన్నాయి.. కొత్తగా ఎన్ని బస్సులు అవసరం ఉంటుందనే దానిపై లెక్కలు కడుతున్నారు. త్వరలోనే ఈ పథకం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో 1200 బస్సులు...

ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1200 ఆర్టీసీ బస్సులు మాత్రమే ఉన్నాయి. ఇక ప్రైవేట్ అద్దె బస్సులు 150 వరకూ ఉన్నాయి. అదే రాష్ట్రస్థాయిలో 11 వేలకు మించి బస్సులు లేవు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం వల్ల అవసరాల రీత్యా కొత్త బస్సులు కొనుగోలు చేయాల్సిందే. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బస్సులు ప్రజల ప్రయాణవసరాలకు ఎంత మాత్రం సరిపోవడం లేదు. చాలావరకు కాలం తీరిన బస్సులతో కాలక్షేపం చేయాల్సి వస్తోంది. గత ఐదేళ్లలో కొత్త బస్సుల ఊసు లేకపోవడంతో కాలం తీరిన డొక్కు బస్సులనే ప్రయాణికులు ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభిస్తే బస్సులు ఎక్కే వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతుంది. మహిళల ఆదరణ కారణంగా ఉన్న బస్సులు సరిపోయే పరిస్థితి ఉండదు. దీంతో కచ్చితంగా కొత్త బస్సులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఈ పథకాన్ని ప్రారంభించాలంటే కొత్త బస్సుల కొనుగోలు అనివార్యంగా కనిపిస్తోంది. కొనుగోలు చేయకపోతే బస్సులు సరిపోయే పరిస్థితి లేదు. సంస్థకు దశల వారీగా 30 వేల బస్సుల అవసరం ఉందని అప్పుడే ఆ పథకాన్ని అమలు చేయడం సాధ్యమవుతుందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకుడు అరిగెల నరసింహారావు అభిప్రాయపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు పథకం కోసం కొత్తగా బస్సులు కొనుగోలు చేయడంతో బాటు అదనపు సిబ్బందిని రిక్రూట్‌మెంట్ చేయాల్సి ఉంటుందని, మరింత మందికి ఉద్యోగాలు కూడా వస్తాయని ఉద్యోగ సంఘం నేతలు చెబుతున్నారు.

ప్రైవేటీకరణకు అడ్డుకట్ట..

ఉద్యోగ సంఘాలను భయపెడుతున్న విద్యుత్ బస్సుల స్థానంలో డీజిల్ బస్సులు వస్తాయన్నది ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నేతల ఆలోచనగా ఉంది. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల విషయమై ఒక పాలసీ తీసుకొచ్చింది. విద్యుత్ బస్సులను అద్దె ప్రాతిపదికన మాత్రమే తీసుకుంటే సంస్థ పూర్తిగా ప్రైవేటీకరణ బాట పట్టే అవకాశం ఉంటుందన్నది ఉద్యోగసంఘాల మాట. మహిళలకు ఉచిత బస్సు వంటి పథకం అమలు చేస్తే విద్యుత్ బస్సుల వంటి భారమైన ప్రాజెక్టుల జోలికి ప్రభుత్వం వెళ్లదన్నది ఉద్యోగ సంఘాల అంతరంగా తెలుస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగుల నుంచి కూడా ఈ పథకం పట్ల సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆర్టీసీ విస్తరణకు తోడ్పడుతుందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి. ప్రధానంగా ఆర్టీసీ సంరక్షణకు లోతైన అధ్యయనం చేసే స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) మహిళల ఉచిత ప్రయాణ పథకాన్ని గట్టిగా బలపరుస్తుంది. ఆర్టీసీ విస్తరణకు నోచుకోక దాని మనుగడే ప్రశ్నార్థకంగా ఉన్న తరుణంలో ఈ పథకం ద్వారా విస్తరణకు అవకాశాలు ఏర్పడతాయన్నది ఉద్యోగ సంఘాల అభిప్రాయం.

ఎక్కడెక్కడ అమలెలా...

ఇతర రాష్ట్రాల్లో మహిళల ఉచిత రవాణా పథకాన్ని అమలుచేస్తున్న ప్రభుత్వాలు ఖర్చును ఆర్టీసీకి రీయింబర్స్‌మెంట్ చేస్తున్నాయి. మన దగ్గర కూడా రాయితీకి అయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాలని ఉద్యోగ సంఘ నేతలు కోరుతున్నారు. దేశవ్యాప్తంగా చూస్తే ఢిల్లీ, పంజాబ్, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలతో పాటు ఆయా రాష్ట్రాల్లో ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం అమలవుతోంది. తమిళనాడు, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏటా ఆర్టీసీకి రూ.4 వేల కోట్ల చొప్పున ప్రభుత్వం నుంచి సాయం అందుతోందని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ చెబుతోంది. ఉచిత బస్సు ప్రయాణం వల్ల తమపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంటుందని ఉద్యోగులు చెప్తున్నారు.

కొమ్మనాపల్లిలో తగ్గిన డయేరియా కేసులు

- కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం
- ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా
- జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారుల పర్యటన
- ప్రత్యేక బృందాలతో ఇంటింటా సర్వే
- బాధితులకు మెరుగైన వైద్యం-యనమల

తొండంగి, జూన్ 16: కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో గత నాలుగు రోజులుగా పదుల సంఖ్యలో నమోదైన డయేరియా కేసుల సంఖ్య ఆదివారం నాటికి ఐదుకు చేరి తగ్గుముఖం పట్టాయి. జిల్లా అధికారులు, స్థానిక వైద్యాధికారులు నిరంతర పర్యవేక్షణలో డయేరియా రోగులకు వైద్య సేవలు అందించారు. స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఐదుగురికి చికిత్స అందించారు. గత నాలుగు రోజులుగా సుమారు 80 మంది రోగులు డయేరియా బారిన పడ్డారు. వీరిలో 36 మందిని జీజీహెచ్‌కు తరలించారు. వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో మరికొందరు చికిత్స పొందుతున్నారు. తాగునీటి కలుషితం కారణంగానే వ్యాధి వ్యాపించినట్లు గ్రామస్థులు చెప్పారు. తాగునీటి శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపారు. దానికి సంబంధించిన రిజల్ట్ రావాల్సి ఉంది. గ్రామంలో మురుగు కాల్వల పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. సిల్ట్ ట్రాక్టర్లతో తరలించారు. వివిధ గ్రామాల నుంచి డిప్యూటేషన్ పై నియమించిన పారిశుధ్య సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఐదు ట్రాక్టర్ల ద్వారా తాగునీటిని ఇంటింటికి సరఫరా చేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టే నిమిత్తం కోటనందూరు, తుని తదితర మండలాల నుంచి కూడా పారిశుధ్య సిబ్బందిని రప్పిస్తున్నారు.


పరామర్శిస్తున్న ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రత్నకుమార్


సమీక్షిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో నర్సింహనాయక్

గ్రామాన్ని సందర్శించిన జిల్లా అధికారులు

కొమ్మనాపల్లి గ్రామంలో జరుగుతున్న డయేరియా నివారణ కార్యక్రమాలను జిల్లా వైద్యశాఖాధికారి నర్సింహనాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రత్నకుమార్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సరిత, పెద్దాపురం ఆర్డీవో సీతారామాంజనేయులు సందర్శించారు.జిల్లా వైద్యాధికారి నర్సింహనాయక్ వైద్య సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బందిని ఇంటింటా సర్వే చేయాలని ఆదేశించడంతో 334 గృహాలలో సర్వే నిర్వహించారు. అన్ని నీటి వనరులను క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండి రోగులకు మెరుగైన వైద్య సహాయం అందించాలన్నారు. ఎంపీడీవో మార్కేండేశ్వరరావు, వైద్యాధికారులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతి, గ్రామ సర్పంచ్ కోన అమ్మాజీ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

బాధితులకు మెరుగైన వైద్యం: యనమల రామకృష్ణుడు

కొమ్మనాపల్లి గ్రామంలో డయేరియా బారిన పడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే యనమల దివ్య గ్రామాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారన్నారు. తాను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో మాట్లాడి రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన వైద్యం అందించాలని సూచించామన్నారు. జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారని, ఎవరూ ఎటువంటి భయాలకు లోనవ్వవద్దన్నారు. గ్రామంలో వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చేంత వరకూ నిరంతరాయంగా వైద్య శిబిరం నిర్వహించాలని సూచించామన్నారు.

ఘనంగా ప్రారంభమైన బాలబాలాజీస్వామి కల్యాణోత్సవాలు



మామిడికుదురు, జూన్ 16: అప్పనపల్లి బాలబాలాజీస్వామి తిరు కల్యాణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జ్యేష్ఠ శుద్ధ దశమి ఆదివారం స్వామివారికి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, పరిషత్ దక్షిణ, రుత్విక్‌వరుణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన హోమం, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠిలను అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చక బృందం ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. సాయంత్రం అమలాపురానికి చెందిన శ్రీలక్ష్మీవల్లభ అన్నమయ్య భజన మండలి కోలాట భజన ఆకట్టుకుంది. బాలబాలాజీస్వామి సన్నిధి భక్తులతో కోలాహలంగా మారింది. సోమవారం రాత్రి 8.59 గంటలకు స్వామివారి తిరుకల్యాణం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ సహాయ కమిషనరు జి.మాధవి తెలిపారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు.


స్తంభాన్ని ఢీకొన్న కారు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గండేపల్లి, జూన్ 16: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో మల్లేపల్లి గ్రామ శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం.. రాజమండ్రి వైపు నుంచి వైజాగ్ వైపు వెళ్లే కారు అదుపుతప్పి డివైడర్ ఎక్కి స్తంభాన్ని ఢీకొంది. అయితే కారులో ఉన్న ఆరుగురికి ప్రమాదం తప్పింది. సంఘటన స్థలానికి హైవే పోలీసులు వాహనంలో చేరుకుని ప్రమాద వివరాలు సేకరిస్తుండగా అన్నవరం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు రోడ్డు పక్కనే ఆగి ఉన్న హైవే పోలీసు కారును వెనుక నుంచి ఢీకొట్టడంతో పామాయిల్ తోటలోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.




గాయపడిన మహిళ

కుటుంబంలో చిచ్చుపెట్టిన ఎన్నికల పందెం

భార్యను హత్య చేసిన భర్త?

- అప్పు చేసి వైసీపీ మీద రూ.3.50 లక్షల పందెం
- ఓడిపోవడంతో అప్పు తీర్చేందుకు నగలు ఇవ్వాలని భార్యపై ఒత్తిడి


సీత(ఫైల్)

సర్పవరం జంక్షన్, జూన్ 16: అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ తరపున రూ. 3.50 లక్షలు అప్పుచేసి బెట్టింగ్ కాశాడు. పందెంలో డబ్బులు పోయాయి. అప్పు తీర్చేందుకు భార్య బంగారం ఇవ్వమని అడిగాడు. ఆమె నిరాకరించడంతో నిద్రలో ఉండగా కిరాతకంగా హత్య చేశాడు. ఈ సంఘటన కాకినాడ రూరల్ హార్బర్ పేటలో జరిగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకు చెందిన ఓలేటి నరసింహమూర్తికి, ఓలేటి సీత (26)కు ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం భర్త స్థానిక పోర్టులో సెక్యూరిటీగా పని చేస్తూ, చేపలు పడే సమయంలో రిక్షా తొక్కుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య స్థానికంగా గల రొయ్యల కంపెనీలో పని చేస్తోంది. అన్యోన్యంగా సాగిన వీరి కాపురంలో బెట్టింగ్ భూతం చిచ్చురేపింది. వైసీపీ గెలుపుపై అప్పు చేసి రూ. 3.50 లక్షలు బెట్టింగ్‌కు పాల్పడ్డాడు. ఈ పందెంలో ఓడిపోవడంతో చేసిన అప్పు తీర్చలేక, బంగారం, డబ్బుల కోసం భార్యను వారం రోజుల నుంచి వేధింపులకు గురి చేస్తున్నాడు. దాంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. కుమార్తె సంతోషం కోసం సీత తండ్రి పాలెపు కాసుబాబు కొంత సొమ్మును అల్లుడు నరసింహమూర్తికి ముట్టచెప్పాడు. ఇంకా డబ్బుల కోసం తాకట్టు పెట్టేందుకు బంగారు వస్తువులు ఇవ్వాలని శనివారం రాత్రి భార్యను అడగ్గా, ఆమె నిరాకరించడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా స్థానికులు సర్దిచెప్పారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు 3-4 గంటల సమయంలో తన భార్య ఓలేటి సీత తలపై ఎవరో దాడి చేసి పుస్తెలతాడు, చెవిలీలు తీసుకుని హత్య చేశారంటూ నరసింహమూర్తి పోలీసులు, బంధువులకు సమాచారం అందించాడు. ఈ సమాచారంతో కాకినాడ ఎస్‌డీపీవో కె.హనుమంతరావు, సర్పవరం ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో ఏ.సన్యాసిరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై భర్త, బంధువులు, స్థానికులను అడిగి వివరాలు సేకరించారు. బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్న అల్లుడు నరసింహమూర్తి గత వారం రోజులుగా డబ్బులు కోసం కుమార్తెను వేధింపులకు గురిచేస్తున్నాడని సీత తల్లి వీరవేణి పోలీసులకు తెలిపింది. డబ్బుల కోసం కావాలనే అల్లుడే ఈ హత్య చేసి ఏమీ తెలియనట్లు నాటకాలు ఆడుతున్నాడని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసింది. మృతురాలి తల్లి వీరవేణి ఫిర్యాదుతో ఎస్‌డీపీవో హనుమంతరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సన్యాసిరావు తెలిపారు. ఈ హత్య బయటవారు చేశారా, అంతర్గతంగా చేశారనేది దర్యాప్తులో తేలుతుందన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు.

అనంతలక్ష్మి అమ్మవారికి వజ్ర కిరీటం

శ్రావణ మాసంలో సమర్పించేందుకు దాత సన్నాహాలు

అన్నవరం, జూన్ 16: కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవం అన్నవరం సత్యదేవుడి పర్వదినాలు మినహా నిత్యం వజ్ర కిరీటంతో భక్తులకు దర్శనమిస్తుండగా త్వరలో దేవేరి అనంతలక్ష్మి అమ్మవారు వజ్ర కిరీట అలంకారంలో భక్తులను అనుగ్రహించనున్నారు. పూర్వపు ట్రస్టీ, దేవస్థానం డోనార్ అయిన లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ దీనిని అమ్మవారికి చేయించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఈవో రామచంద్రమోహన్‌ను కలిసి చర్చించారు. కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ స్వామీజీ సూచనలతో శ్రావణ మాసంలో అందజేయనున్నట్లు ఈవోకు తెలిపారు. సుమారు కిలో బంగారం, 130 క్యారెట్ల వజ్రాలతో వీటిని తయారు చేయించినట్లు దాత తెలిపారు. అమ్మవారికి వజ్రకిరీటం, స్వామి, అమ్మవార్ల వజ్ర కర్ణాభరణాలకు సుమారు రెండు కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఆయన వెంట మట్టే ఆదిశంకర్ తదితరులున్నారు.

అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యుడి రాజీనామా

అన్నవరం, జూన్ 16: అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యత్వానికి ఆదివారం మరో సభ్యుడు రాజీనామా చేశారు. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సిఫార్సుతో తేటగుంటకు చెందిన పేరూరి బద్రీనారాయణను పాలక మండలి సభ్యుడిగా నియమించారు. ప్రభుత్వం మారడంతో నామినేటెడ్ పోస్టులు రద్దు ఉత్తర్వులు త్వరలో వెలువడడంతో బద్రీనారాయణ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. నాలుగురోజుల క్రితం కర్రి బామిరెడ్డి రాజీనామా చేసిన సంగతి విదితమే. అయితే మిగతా సభ్యులు స్వచ్ఛంద రాజీనామా చేస్తారా ఉత్తర్వులు వచ్చే వరకు వేచిచూస్తారా అనేది తెలియాలి. అయితే ఇప్పట్లో పాలకమండలి సమావేశాలు నిర్వహించే అవకాశం లేదని దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు.

భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట, జూన్ 16: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో శివలింగ జీర్ణోద్ధారణ ప్రక్రియ పూర్తి కావడంతో ఆదివారం నిర్వహించిన సంప్రోక్షణ పూజలలో పెద్దాపురం ఎమ్మెల్యే విజేత నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, వెంకన్న, అంజిబాబు, శ్రీనివాసరావు, వినయ్ తదితరులు పూజలు జరిపించారు. గత నెల 28 నుంచి భారతీయ పురావస్తు శాఖ ఆధీనంలో గర్భాలయంలో శివలింగానికి జీర్ణోద్ధారణ పనులు శనివారం సాయంత్రానికి పూర్తిచేసి ఆలయ ఈవో నీలకంఠంకు అప్పగించారు. దీంతో ఆలయ సాంప్రదాయాలకు అనుగుణంగా శివలింగ సంప్రోక్షణ పూజలు ఆదివారం నిర్వహించారు. సోమవారం ఏకాదశి మహాపర్వదినం సందర్భంగా భక్తులకు యథాతథంగా స్వామివారి దర్శనాలకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో నీలకంఠం ఎమ్మెల్యే చినరాజప్పకు వివరించారు. అంతకు ముందు ఆలయం ఆవరణలో శివలింగానికి పంచద్రవ్యములతో ఎమ్మెల్యే చినరాజప్ప అభిషేకించారు. ఆలయంలో నంది మండపం వద్ద ప్రత్యేక వేదికపై ఏర్పాటుచేసిన ఉత్సవమూర్తులను ఎమ్మెల్యే చినరాజప్ప దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ కార్యనిర్వహణాధికారి నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్ట్ సందర్శించేందుకు రానున్నందున తనకు సైతం ఆహ్వానం అందిందని సోమవారం ఉదయం పోలవరం బయలుదేరి వెళుతున్నట్లు చెప్పారు.


గోపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప

శిరోముండనం కేసు.. సామాజిక స్వేచ్ఛ కోసం పోరాటం

దామోదరం సంజీవయ్య నేషనల్ లా స్కూల్ ప్రొఫెసర్ కె.సుధ

అమలాపురం రూరల్, జూన్ 16: దేశంలో రాజకీయ, సామాజిక స్వేచ్ఛ కోసం జరిగిన సుదీర్ఘ పోరాటమే వెంకటాయపాలెం శిరోముండనం కేసు అని దామోదరం సంజీవయ్య నేషనల్ లా స్కూలు ప్రొఫెసర్ కె.సుధ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఈదరపల్లిలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ప్రముఖ కవి నామాడి శ్రీధర్ అధ్యక్షతన 'శిరోముండనం తీర్పు-నేరానికి తగిన శిక్షణ' అంశంపై మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ సుధ మాట్లాడుతూ దేశంలోను, రాష్ట్రంలోను జరుగుతున్న ఆత్మగౌరవ పోరాటాలన్నీ ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసమేనన్నారు. ఇటువంటి పోరాటాలను పౌర సమాజం వ్యక్తిగత సమస్యలుగా అర్థం చేసుకుంటే దేశ ప్రజాస్వామ్య విలువలకు తీరని అన్యాయం చేసినట్టేనన్నారు. నిరంతర ప్రజా పోరాటాలు మాత్రమే న్యాయ, శాసన వ్యవస్థలను సక్రమంగా వ్యవహరించేలా చేయగలుగుతాయన్నారు. వెంకటాయపాలెం శిరోముండనం కేసులో 28 ఏళ్ల పాటు ఎటువంటి రాజకీయ, ఆర్థిక ప్రలోభాలకు లొంగకుండా న్యాయం కోసం పోరాడిన వారంతా బాధితులు కారని, వారంతా ప్రజా పోరాట యోధులని ఆమె అభివర్ణించారు. శిరోముండనం బాధితుడు కోటి చినరాజు మాట్లాడుతూ తోట త్రిమూర్తులు అనుచరులు చేస్తున్న రిగ్గింగును తాము ఎన్నికల ఏజెంట్లుగా అడ్డుకోవడమే శిరోముండనానికి దారితీసిందన్నారు. మరో బాధితుడు చల్లపూడి పట్టాభిరామయ్య మాట్లాడుతూ ఎన్నికల వేళ తమను తీవ్రంగా కొట్టి గాయపరిచి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వాలు నిందితుడిని కాపాడేందుకు అన్ని విధాలా సహకరించాయన్నారు. తొలుత పోరాటానికి సహకరించిన గుర్రాల పరంజ్యోతి, తిరుమాని సత్యనారాయణరాజు, కె.బాలగోపాల్, బొజ్జా తారకంలకు గుబ్బల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జోహార్లు అర్పించారు. దళిత ఐక్య పోరాట వేదిక నాయకుడు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ ప్రజా సంఘాల సమిష్టి కృషే శిరోముండనం కేసు విజయమన్నారు. ఈ కేసులో ఎదుర్కొన్న అనేక అవస్థలను ఆయన వివరించారు. సదస్సులో మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రవి, జి.రోహిత్, జిల్లా శాఖ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్, గౌరవ్, విశ్రాంత డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఐఎన్ మల్లేశ్వరరావు, న్యాయవాదులు, బడుగు భాస్కరజోగేష్, నందిక శ్రీనివాస్, పెయ్యల సత్యనారాయణ మాట్లాడారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుధ



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి సుభాష్

మంత్రి సుభాష్‌కు ఘన స్వాగతం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 16: మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఆదివారం ఘన స్వాగతం లభించింది. రావులపాలెం నుంచి మొదలైన విజయోత్సవ ర్యాలీలో మంత్రి సుభాష్‌కు అడుగడుగునా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలతో ముంచెత్తారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు వేలాది మందితో విజయోత్సవ ర్యాలీ సాగింది. రామచంద్రపురం చేరే సరికి రాత్రి 9 దాటింది. బైపాస్ రోడ్డు సెంటర్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ మహిళా నాయకులు జాస్తి విజయలక్ష్మి, గజలక్ష్మి, దేవళ్ల వెంకటలక్ష్మి, బళ్ల లక్ష్మి తదితరులు హారతులు ఇచ్చి పూలమాలలతో స్వాగతం పలికారు. ఏరియా ఆసుపత్రి వద్ద మేదర్ల సంఘం ఆధ్వర్యంలో గజమాలతో ఘనస్వాగతం పలికారు. రాజగోపాల్ సెంటర్‌లో క్రేన్‌తో అభిమానులు గజమాల వేశారు. రామచంద్రపురం నుంచి తాళ్లపొలం, జగన్నాయకులపాలెం మీదుగా ద్రాక్షారామకు ర్యాలీ చేరుకుంది. సోమవారం సుభాష్ పుట్టినరోజు కావడంతో నాయకులు, కార్యకర్తల మధ్య సుభాష్ కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు గంధం పళ్లంరాజు, రాయపురెడ్డి రాజా, మేడిశెట్టి శేషారావు, కడియాల రాఘవన్, రవ్వాభూషణం తదితరులు ఉన్నారు.

30 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


నల్లజర్ల, జూన్ 16: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ విజిలెన్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. విజిలెన్స్ ఎస్‌ఐ జగన్నాథరెడ్డి వివరాల ప్రకారం.. నల్లజర్ల మండలం జగన్నాథపురం రహదారిలో రేషన్ బియ్యం లారీ ఉన్నట్టు సమాచారం రావడంతో ఆదివారం ఉదయం తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఛత్తీసగఢ్‌కు చెందిన లారీలో 30 టన్నులు రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. బియ్యం జగన్నాథపురం నుంచి ఛత్తీసగఢ్‌లోని రాయపూర్‌కు వెళుతున్నట్టు నిర్ధారించుకుని డ్రైవర్ కార్తీక గడభ, లారీ యజమాని లక్ష్మణ్ శ్రీవాస్‌లపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. రేషన్ బియ్యం గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో చేర్చి లారీని నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. దాడిలో విజిలెన్స్ కానిస్టేబుల్స్ జీవానంద, వీరబాబు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ రాజు, వీఆర్వో మూర్తి, నల్లజర్ల పోలీసులు పాల్గొన్నారు.

54 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

అంతర్వేది, జూన్ 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం మోరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. 1968-69 సంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సీ చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ గురువులను సన్మానించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ గురు సత్కారం ఎన్నటికీ మరువలేనిదని, ఆనాటి హెచ్‌ఎం చీర్ల సాంబశివరావు, ఉపాధ్యాయులు కట్టా సూర్యనారాయణ, కంతేటి వెంకట్రామరాజు అన్నారు. ఎక్కడెక్కడో స్థిరపడి పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలిసి వారివారి సంతోషాలను పంచుకున్నారు. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వృద్ధ విద్యార్థులు వారి గురువులకు పాదాభివందనం చేసి గత స్మృతులను నెమరువేసుకున్నారు. వారు ఎలా స్థిరపడ్డారో వారి పిల్లల గురించి తెలుసుకుని మా గురుదేవులు ఎంతో మురిసిపోయారన్నారు. కార్యక్రమంలో ప్రస్తుత హెచ్‌ఎం శ్రీధర్, జాన శంకరరావు (బాబ్జి), సుప్రీంకోర్టు న్యాయవాది మంగళంపల్లి శ్రీరామమూర్తి, జాన సుబ్రహ్మణ్యేశ్వరరావు, యెనుముల సుబ్బారావు, చింతా సుధాకరరావు, చింతా వీవీ సత్యనారాయణ, యెనుముల సత్యనారాయణ, గెడ్డం పేర్రాజు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు మూడో స్థానం


మూడో స్థానం సాధించిన జట్టు సభ్యులు

పిఠాపురం, జూన్ 16: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషుల జట్టుకు మూడో స్థానం లభించింది. ఉమ్మడి జిల్లా జట్టు బాపట్లలో జరిగిన రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నారు. అక్కడ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచినట్లు రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఉమ్మడి జిల్లా రగ్బీ జట్టును జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కుమార్, అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్ నాగలింగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కేతవరపు కృష్ణ, సభ్యులు కె.పద్మనాభం, సోము గోవిందరాజు, బి.వంశీ, జి.శివప్రసాద్, బి.సతీష్ అభినందించారు.

సత్యదేవుని ఆలయంలో అల్లరి నరేష్ పూజలు



అన్నవరం, జూన్ 16: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖ సినీనటుడు అల్లరి నరేష్ కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలకగా దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

తలుపులమ్మ లోవలో భక్తుల కిటకిట



తుని రూరల్, జూన్ 16: తూర్పు కనుమల్లో కొలువై భక్తుల ఆరాధ్య దైవమైన తలుపులమ్మ అమ్మవారి లోవ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారి ప్రధాన ఆలయంలో తల్లిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదులు, బహిరంగ ప్రదేశాలలోని వంటషెడ్లలో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. అమ్మవారిని ఆదివారం ఒక్కరోజు సుమారు 20 వేల మంది భక్తులు దర్శించుకోగా ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.4.45 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో కె.విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


ఆరు బయట వంటలు

అంతర్వేది ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు


న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, జూన్ 16: అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ టి.మల్లికార్జునరావు విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. మల్లికార్జునరావు దంపతులకు ఆలయ ఏసీ సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ విశిష్టత, చరిత్రలను వారికి వివరించారు.

రెండు బైక్‌లు ఢీ: బీటెక్ విద్యార్థి మృతి


శ్రీకాంత్

మారేడుమిల్లి, జూన్16: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఆదివారం కాకినాడలో బీటెక్ రెండో ఏడాది చదువుతున్న శేషపు శ్రీకాంత్, కాకినాడకు చెందిన ఎం.సాయి మౌనిష్ మారేడుమిల్లి ప్రాంతం గుడిసె పర్యాటకానికి వచ్చి వెళుతుండగా మారేడుమిల్లి మండలం బోదులూరు, ఉక్కులూరు మధ్య ఎదురుగా వస్తున్న పల్సర్ బైక్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో శ్రీకాంత్(19) అక్కడికక్కడే మృతి చెందాడు. సాయి మౌనిష్‌కు తీవ్రగాయాలు కావడంతో మారేడుమిల్లి పీహెచ్‌సీకి తరలించారు. దీనిపై మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మామిడికుదురు, జూన్ 16: లూటుకుర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో 35ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలలో ఆదివారం కలుసుకుని సందడి చేశారు. ఒకరి క్షేమ సమాచారాలను ఒకరు అడిగి తెలుసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. స్కూలు ఆవరణలో సహపంక్తి భోజనాలుచేసి ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఆనాటి పాత మధురాలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు ఘన స్వాగతం





మండపేట: మంత్రి సుభాష్‌ను అభినందిస్తున్న వేగుళ్ల జోగేశ్వరరావు, ఆలమూరు: ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న సుభాష్, బండారు, పి.గన్నవరం: రావులపాలెంలో స్వాగతం పలికిన డొక్కా నాథ్‌బాబు

రావులపాలెం, జూన్16: కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా జిల్లాకు వచ్చిన వాసంశెట్టి సుభాష్‌కు కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. కళా వెంకట్రావు సెంటరు వద్దకు కొత్తపేట ఎమ్మెల్యే విజేత బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, కూటమి నాయకులు, అభిమానులు పెద్దఎత్తున చేరుకున్నారు. మంత్రికి పూలమాలలువేసి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం సుభాష్ భారీ ర్యాలీగా తరలివెళ్లారు.

పి.గన్నవరం: మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, స్థానిక టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. దుశ్శాలువాతో శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ప్రత్యేక వాహనాల్లో స్థానిక నేతలు అధిక సంఖ్యలో రావులపాలెం వెళ్లారు. స్వాగతం పలికిన వారిలో సంసాని పెద్దిరాజు, తొలేటి సత్తిబాబు, ఆరుమిల్లి లాల్‌బాబు, శేరు శ్రీనుబాబు, గుత్తుల రామకృష్ణ, పెచ్చెట్టి ఈశ్వర్, చీకట్ల రామకృష ఉన్నారు.

ఆలమూరు: మంత్రి వాసంశెట్టి సుభాష్ భారీ ఊరేగింపులో ఆలమూరు మండల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆలమూరులో ఎన్టీఆర్, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు మంత్రి సుభాష్ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆలమూరు, గుమ్మిలేరు మీదుగా మంత్రి రామచంద్రపురం వెళ్లారు.

కె.గంగవరం: మంత్రి వాసంశెట్టి సుభాష్ నియోజకవర్గానికి తొలిసారిగా వస్తున్న సందర్భంగా స్వాగతం పలికేందుకు మండలం నుంచి కూటమి నాయకులు తరలి వెళ్లారు. యండగండి నుంచి చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, శివల నుంచి నిడవోలు సుబ్రహ్మణ్యం, సత్యవాడ నుంచి సలాది ప్రకాష్, తోట వెంకన్న, పామర్రు నుంచి మరివాడ సూరిబాబు, కోటిపల్లి నుంచి రేవు శ్రీను, పాణింగపల్లి నుంచి బలుసు నాగేంద్ర, భట్లపాలిక నుంచి రవ్వా భూషణం, జనసేన నేతలు సలాది ఎర్రిబాబు, తాడాల జానకిరామ్, దేవరపల్లి చక్రి, చిర్రా రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లి సుభాష్‌కు స్వాగతం పలికారు.

మండపేట: మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఆదివారం రాత్రి మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు ఘన స్వాగతం పలికారు. స్థానిక బాబుఅండ్‌బాబు కన్వెన్షన్ హాల్ వద్ద నేతలు మంత్రికి బాణసంచా కాల్చి పూల మాలలతో సత్కరించారు. అనంతరం మంత్రి మండపేట మీదుగా రామచంద్రపురం వెళ్లారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, జూన్ 16: కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. కాట్రేనికోన టౌన్, గెద్దనపల్లి, నడవపల్లి, కుండలేశ్వరం, దొంతికుర్రు, కొప్పిగుంట, పండి, పల్లం, కందికుప్ప, పల్లంకుర్రు, బలుసుతిప్ప, మొల్లేటిమొగ గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

టీడీపీ కూటమి విజయం పేదలకు వరం

అల్లవరం జూన్ 16: టీడీపీ కూటమి విజయం పేదల పాలిట వరమని, సీఎం చంద్రబాబు పాలనలో ఆంధ్రా రామరాజ్యం కానుందని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు అన్నారు. టీడీపీ గోడిలంక గ్రామ ప్రముఖుడు వేగిరాజు సుబ్బరాజు (శ్రీనురాజు), సామంతకుర్రుకు చెందిన కాకిలేటి సూర్యప్రకాశం ఆధ్వర్యంలో దెందుకూరిని ఆదివారం సన్మానించారు. జనసేన అధ్యక్షుడు కాకిలేటి హరికృష్ణ, చెదళ్ల రామ్మోహన్, గుంటూరి సీతారామరాజు, సుంకర శివాజీ, పరసా ఆదినారాయణ, పోతుల కల్యాణ్, ఆకుమర్తి చంటి, సవరపు రమేష్, బొమ్మి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి

అంతర్వేది, జూన్ 16: అంతర్వేది సాగర సంగమ తీరంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. తొలుత ఆంజనేయస్వామి, శివాలయం, క్షేత్రపాలకుడి ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను భక్తులు సందర్శించి స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం వేళ లైట్‌హౌస్, అన్నాచెల్లెలు గట్టు, బీచ్, సాగర సంగమ ప్రదేశాలను పర్యాటకులు సందర్శించారు.

ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న ప్రభుత్వం

మామిడికుదురు, జూన్ 16: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందని జడ్పీ మాజీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త నామన రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం మగటపల్లిలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా రాంబాబు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో పరిపాలన చేయగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. బొలిశెట్టి జయరామ్, నామన నాగేశ్వరరావు, కుంపట్ల బాబ్జి, మానేపల్లి రామకృష్ణ, నక్కా త్రిలోచనరావు, యాలంగి శ్రీనివాస్, బొలిశెట్టి నాగభూషణం, కుంచే శ్రీనివాస్, నామన నానారు, పల్లి శ్రీను, గోగి గోపి పాల్గొన్నారు.

కిశోర్-దుర్గావతి దంపతులకు సన్మానం

మామిడికుదురు, జూన్ 16: టీడీపీ విజయానికి కృషిచేసిన ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చుట్టుగుళ్ల కిశోర్-దుర్గావతి దంపతులను పాశర్లపూడి గ్రామశాఖ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు పెద్దబ్బులు, కొల్లు ఏడుకొండలు, తాడి పుష్పరాజు, కొల్లు నరసింహారావు, అంకాడి భాస్కరరావు, మల్లాడి రాంబాబు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ద్వారా సామాజిక సేవ

మామిడికుదురు, జూన్ 16: రోటరీ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు యేడిద కవీంద్ర పేర్కొన్నారు. ఆదుర్రు గ్రామంలో మల్టిపుల్ మస్క్యులార్ డిస్ట్రపీ అనేఆరోగ్య సమస్యతో బాధపడుతున్న 13ఏళ్ల బాలుడు కొంబత్తుల రాకేష్‌కు రూ.10వేలు అందించారు. దాత పేరూరి రామకృష్ణ అందించిన రూ.5వేలను, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ మొహిద్దీన్ అందించిన రూ.2వేలు కలిసి మొత్తం రూ.7వేలను మామిడికుదురు శివారు ఈర్ల చెరువుకు చెందిన ముషినే సత్యనారాయణకు క్లబ్ ద్వారా అందించారు. సెక్రటరీ చిట్టినీడి లక్ష్మణరావు, నార్కేడుమిల్లి బాలకృష్ణ, యెనుముల వెంకటరమణ, లక్కింశెట్టి శ్రీబాబు పాల్గొన్నారు.

ఐదు సంతకాలతో హామీలు అమలు

మండపేట, జూన్16: సీఎం చంద్రబాబు ఐదు సంతకాలు చేసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో గాడితప్పిన పాలన కూటమి ప్రభుత్వంతో గాడిన పడుతుందన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అవుతాయన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి పేదల భూములకు రక్షణ కల్పించారన్నారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి పేదల ఆకలి తీర్చటం జరుగుతుం దన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవరప్రకాష్‌కు సత్కారం

మండపేట, జూన్ 16: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు విజయం కోసం పనిచేసిన మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌ను స్థానిక బాబు అండ్‌బాబు కన్వెన్షన్‌హాల్‌లో ఆదివారం పట్టణ రిక్షా కార్మికులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.సంజయ్, కె.పౌలు, వై.ఏసు, వెంకన్న, రాజు, సత్తిబాబు, అప్పారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కపిలేశ్వరపురం, జూన్ 16: వల్లూరులో కొలువైయున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివార్కి పంచామృతాభిషేకం, విశేషఅర్చన నిర్వహించారు. స్వామి, దేవరులను పెండ్లి కుమారుడి, పెండ్లి కుమార్తెలను చేయుట తదితర పూజా కార్యక్రమాలను వేదమంత్రోచ్చారణల నడుమ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గరుడ, శేష వాహనాలతో గ్రామోత్సవం ఘనంగా జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసత్తెమ్మతల్లి జాతర

అంతర్వేది, జూన్ 16: శృంగవరప్పాడులో వెలసి ఉన్న శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రతీరోజు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గ్రామ ఆడపడుచులంతా అమ్మవారికి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. అన్నసమారాధన అనంతరం అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను వేలం పాట నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అమలాపురం టౌన్ బ్యాంకు వ్యాపారం రూ.90కోట్లు



అమలాపురం టౌన్ బ్యాంకులో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న డాక్టర్ మెట్ల వెంకటసూర్యనారాయణ

అమలాపురంటౌన్, జూన్ 16: అమలాపురం కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి రూ.90కోట్లు వ్యాపారం నిర్వహించినట్టు చైర్మన్ డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ తెలిపారు. రూ.1.19కోట్లు లాభం వచ్చిందన్నారు. టౌన్‌బ్యాంకు 26వ వార్షిక మహాజన సభను ఆదివారం గండువీధిలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో డాక్టర్ సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. టౌన్ బ్యాంకులో రూ.50కోట్ల మేర డిపాజిట్లు ఉన్నాయని, వివిధ రంగాలకు రూ.39కోట్లు రుణాలుగా అందజేశామన్నారు. ఖాతాదారుల సహకారంతో టౌన్ బ్యాంకు ప్రగతిపథంలో నడుస్తోందన్నారు. ఈ ఏడాది సభ్యులకు 13శాతం డివిడెండ్ ప్రకటించామన్నారు. 2023-24ఆడిట్ రిపోర్టును, 2024-25, 2025-26 అంచనా బడ్జెట్‌లను బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ శిరగం వేణుగోపాలరావు ప్రవేశపెట్టగా మహాజన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈఏడాది పదో తరగతిలో అమలాపురం డివిజన్ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులకు బ్యాంకు చైర్మన్, డైరెక్టర్లు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. వైస్ చైర్మన్ ఎండీ అమీర్, డైరెక్టర్లు ఎంకే నాయుడు, డాక్టర్ గోదశి గంగరాజు, డాక్టర్ ఆకెళ్ల వెంకట్రావు, డాక్టర్ గొలకోటి రంగారావు, అల్లాడి శ్రీనివాస్, చింతా శంకరమూర్తి, పి.జాన్‌పాల్, నూలు సురేష్, శిరగం వేణుగోపాలరావు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి



బుచ్చిబాబును అభినందిస్తున్న తీర్థాలమొండి మత్స్యకార మహిళలు

ఐ.పోలవరం, జూన్ 16: తీరప్రాంత మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముమ్మిడివరం ఎమ్మెల్యే విజేత దాట్ల బుచ్చిబాబు అన్నారు. భైరవపాలెం పంచాయతీ తీర్థాలమొండికి చెందిన మత్స్యకార మహిళలు ఆదివారం మురమళ్ల క్యాంపు కార్యాలయంలో బుచ్చిబాబును కలిసి అభినందించారు. నాలుగు మండలాల నుంచి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుచ్చిబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. తాళ్లరేవు మండల నాయకులు నోట్‌బుక్స్ అందించి అభినందించడం విశేషం. కార్యక్రమంలో కుడుపూడి శ్రీమన్నారాయణ, జనసేన నాయకులు ముత్యాల జయలక్ష్మి, గుద్దటి జమ్మి, అత్తిలి బాబూరావు, ధూళిపూడి గోపిలయ్య, టి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిబాబును కలిసిన మీ సేవ ఉద్యోగులు

కాట్రేనికోన, జూన్ 16: మురమళ్ల క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే విజేత దాట్ల బుచ్చిబాబును కాట్రేనికోన మండల మీసేవ కేంద్రాల నిర్వాహకులు కలిసి అభినందనలు తెలిపారు. సమస్యలపై వారు బుచ్చిబాబుకు వివరించారు. ప్రభుత్వానికి తెలియజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బుచ్చిబాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మట్టపర్తి రవీంద్రనాధ్, కాశి శ్రీనివాసరావు, ఆనంద్, మూర్తి, కుమార్, సతీష్‌ల, కాసు

వెంకన్న ఆదాయం రూ.4.26లక్షలు

ఆత్రేయపురం, జూన్ 16: కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.4,26,774 లభించినట్టు ఉప కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. అలాగే అన్నప్రసాద భవన నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన కోటూరి రామకృష్ణరాజు రూ.50వేలు విరాళం అందజేశారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి



పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆనందరావు

అమలాపురం టౌన్, జూన్ 16: నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడకుండా పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అమలాపురం ఎమ్మెల్యే విజేత అయితాబత్తుల ఆనందరావు సూచించారు. అమలాపురం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆనందరావు పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలో సీఎస్సార్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. నాట్ స్టార్టెడ్ పనులకు వెంటనే టెండర్లు పిలిచి మొదల పెట్టాలన్నారు. ఏ ప్రభుత్వంలో మంజూరైన పనులైనప్పటికీ అభివృద్ధి కుంటుపడకుండా ముందుకు సాగాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి ప్రధాన సమస్యలను తీసుకువెళ్లడంతో పాటు పట్టణంలో బైపాస్‌వంతెనలు, రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేయడానికి నిర్ణయించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.చంటిబాబు, ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబు, పీఆర్ డీఈ పీఎస్ రాజ్‌కుమార్, ఏఈలు రాధాకృష్ణ, సత్యనారాయణ, సంపన్న, గంగాధర్ పాల్గొన్నారు.

వెలుగులు నింపుతున్న చంద్రబాబు

అమలాపురం టౌన్, జూన్ 16: పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపట్టారని అమలాపురం ఎమ్మెల్యే విజేత అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ఎన్నికల హామీల అమలుపై తొలి ఐదు సంతకాలు చేసి రాష్ట్రంలో పాలనను గాడిలో పెట్టడంతో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. అమలాపురంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వృద్ధులకు పెన్షన్ అమలుచేసిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కిందన్నారు. రూ.25 పెన్షన్‌ను రూ.4వేలకు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్టు ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చొల్లంగి సత్యసాయిబాబా, బొర్రా ఈశ్వరరావు, అధికారి జయవెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కూటమి విజయంతో సంబరాలు



విజయోత్సవ వేడుకల్లో లీలాకృష్ణ

కపిలేశ్వరపురం, జూన్ 16: కూటమి భారీ విజయం సాధించడం పట్ల నల్లూరులో ఆదివారం టీడీపీ, జనసేన నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు వల్లూరి సాయికుమార్‌బాబు, జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వానికి నల్లూరు గ్రామప్రజలు అత్యధిక మెజారిటీ ఇచ్చినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రజా సమస్యల పరిష్కారానికి కష్టించి పనిచేసే నాయకుడన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. గ్రామంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత వారు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముత్యాల వెంకట్రావు, ఎంపీటీసీ గుడేల మధుకుమారి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు నరాల వీరరాఘవులు, పెనుమర్తి జగదీష్, మేడిశెట్టి శ్రీనివాస్, పిల్లి మురళీకృష్ణ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.50వేలు విరాళం

ఐ.పోలవరం, జూన్ 16: ఏలూరుకు చెందిన భక్తుడు కందికట్టు శ్రీనివాస్ దంపతులు ఆదివారం మురమళ్ళ వీరేశ్వర స్వామి అన్నదానట్రస్టుకు రూ.50వేలు విరాళాన్ని ఆలయ ఉద్యోగి కొమ్మిరెడ్డి సూరిబాబు అందించారు. దాతను ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. దాత దంపతులకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సిబ్బంది సత్కరించారు. అర్చకుడు ఉండి దత్తుశర్మ పాల్గొన్నారు.

పవన్ విజయంతో పోలేరమ్మకు 10కోళ్ల సమర్పణ



అమలాపురంటౌన్, జూన్16: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఘన విజయం సాధించడంతో సోమవారం సమనస గ్రామస్థులు కోళ్లతో పోలేశ్వరమ్మకు మొక్కులు చెల్లించారు. జనసేన నేత మామిళ్లపల్లి దొరబాబు ఆధ్వర్యంలో ఊరంతా వచ్చి 101కోళ్లను పోలేరమ్మకు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. పవన్ విజయానికి పోలేరమ్మ ఆశీస్సులు ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు పవన్ అధిరోహించాలని పోలేరమ్మకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపసర్పంచ్ మామిళ్లపల్లి దంపతులు, బోడేశ్వరరావు, జనసేన కార్యకర్తలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామి ఉత్సవాలకు కమిటీ

మామిడికుదురు, జూన్16: అప్పనపల్లి బాలబాలాజీ ఉత్సవాలనిర్వహణకు ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు దేవస్థాన ఈవో జి.మాధవి తెలిపారు. తులా ఉమామూలేశ్వరస్వామి, బొంతు ఆనందరావు, పడవల వీవీఎస్ మల్లేశ్ కామిశెట్టి సూర్యచంద్రదాస్, మాకే సత్యశ్రీధర్, కోలా రాంబాబు, పాటి వెంకట్రావు, కేతా శ్రీనివాస్, కంకిపాటి సుబ్బారావులను ఉత్సవ కమిటీ సభ్యులుగా నియమించినట్టు ఏసీ తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా పవన్‌కుమార్



కొత్తపేట, జూన్ 16: కొత్తపేట మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా యెందూరి పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఎన్నికలో ఆయన విజయం సాధించారు. పవన్‌కుమార్‌ను ఆర్యవైశ్య సంఘ నాయకులు పచ్చిపులుసు కృష్ణారావు, గమిడి ఆనంద్, తమ్మన సాయిప్రసాద్, సూతాపల్లి రాధాకృష్ణ, ఎస్ఎస్‌యూకే లింగేశ్వరరావు అభినందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: మనమే
శ్రీలలిత	: రక్షణ
శేఖర్ స్క్రీన్-1	: ప్రేమించొద్దు
శేఖర్ స్క్రీన్-2	: బ్యాడ్‌బాయ్స్
రమా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	: బాక్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సత్యభామ
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భజే వాయువేగం

భక్తులతో కిటకిటలాడిన సిద్ధివినాయక ఆలయం

అయినవిల్లి, జూన్ 16: అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు జరిపించుకున్నారు. క్యూలైన్లు, ఆలయ మండపాలు భక్తులతో కిక్కిరిశాయి. నూతన వాహనాలకు భక్తులు పూజలు జరిపించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది సేవలందించారు.

వేగుళ్లను అభినందించిన పీఎంపీలు

మండపేట, జూన్16:స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును పీఎంపీ అసోసియేషన్ నాయకులు ఆదివారం కలిసి సత్కరించారు. పీఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వేగుళ్ల వారికి హామీ ఇచ్చారు. పీఎంపీ అసోసియేషన్ నాయకులు కె.సత్యనారాయణ, వీరభద్రరావు, ఎం.వీరబాబు, బళ్ల వెంకటరమణ, వానపల్లి కనకరాజు పాల్గొన్నారు.

విద్యుత్‌చార్జీల పెంపు భారం తగ్గించాలి

యానాం, జూన్ 16: యానాం నియోజవర్గంలో ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీల పెంపు భారం తగ్గించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. సీఎం రంగసామికి ఆయన వినతిపత్రం అందజేశారు. దరియాలతిప్పలో విద్యుత్ చౌర్యం జరిగిన పరిశ్రమకు సంబంధించిన మొత్తం భారం సర్‌చార్జి రూపంలో యానాం ప్రజలపై వేయడంతో భారం మరింతగా పెరిగిందన్నారు. ఈసమస్యను తక్షణం పరిష్కరించాలని పుదుచ్చేరిలో ఉన్నతాధికారులకు, మంత్రులకు తెలియజేసినప్పటికి కొందరు అధికారులు అలసత్వంతో వ్యవహరిస్తున్నారన్నారు. సీఎం స్పందించి విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని కోరారు.

విత్తన బంతుల తయారీపై అవగాహన

అమలాపురం టౌన్, జూన్ 16: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విత్తన బంతుల తయారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని చంద్రశేఖర్ ఆజాద్ పార్కులో ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో విత్తన బంతుల తయారీపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని తయారు చేయించారు. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని... అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నెలకొంటున్నాయని వివరించారు. మైదాన ప్రాంతాల్లో కూడా మొక్కలు నాటి సంరక్షించినప్పుడే ప్రాణవాయువు పుష్కలంగా లభిస్తుందన్నారు. విద్యార్థులతో విత్తన బంతులను తయారు చేయించి వాటిని వివిధ ప్రాంతాల్లో నాటారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యల్లమిల్లి నాగసుధా కొండలరావు, అడ్డాల గోపాలకృష్ణ, కుడుపూడి శాంతిభూషణం పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం, జూన్ 16: స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్ తెలిపారు. సెంటాక్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐటీఐలో చేరే ప్రతి విద్యార్థికి నెలకు రూ.వెయ్యి శిక్షణ భృతి, ప్రతి తరగతి టాపర్‌కు నెలకు రూ.వెయ్యి ప్రోత్సాహకంగా, ఏటా రెండు జతల దుస్తులు, ఒక వర్కింగ్ కోచ్, గుర్తింపుకార్డు, ఉచిత మధ్యాహ్న భోజనం అందజేస్తామన్నారు. బాలికలకు కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ ఏడాది కోర్సు, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ, బాలురకు పిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్, ఎలక్ట్రీషియన్ రెండేళ్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. జూన్ 30లోగా దరఖాస్తులు చేయాలని, వివరాలకు ఐటీఐ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వేగుళ్ల పరామర్శ

రాయవరం, జూన్ 16: పలు కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. కొమరిపాలేనికి చెందిన మురళీమోహన్ రైస్‌మిల్లు అధినేత చింతా పాండు రంగారెడ్డి ఇటీవల మరణించగా రంగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు పసలపూడిలో చింతా సూరయ్యమ్మ, కిల్లి పూర్ణిమ, కర్రి వెంకటరెడ్డి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, అనుసూరిశ్రీనివాసరావు, కొవ్వూరి సుధాకరరెడ్డి, నల్లమిల్లి వెంకన్నబాబు, చింతా వెంకటరెడ్డి, కొవ్వూరి బులిరెడ్డి, కర్రి గోపాలకృష్ణారెడ్డి, పడాల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బండారుకు అభినందనలు

ఆత్రేయపురం, జూన్ 16: కొత్తపేట ఎమ్మెల్యేగా విజయం సాధించిన బండారు సత్యానందరావును ఆత్రేయపురం టీడీపీకి చెందిన ప్రముఖులు, మాజీ ప్రతినిధులు ఆదివారం ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముళ్లపూడి భాస్కరరావు, మాజీ ఎంపీపీలు వాకపల్లి వెంకటకృష్ణారావు, పీఎస్ రాజు, తెలుగు మహిళ మండల శాఖ అధ్యక్షురాలు దుగ్గిరాల సుబ్బలక్ష్మి, టీడీపీ బీసీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు అయినం నాగరాజు, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి సురేష్‌బాబు, వందల సంఖ్యలో సంఖ్యలో కార్యకర్తలు బండారును కలిశారు. దుశ్శాలువాలు కప్పి పూలమాలలువేసి అభిమానాన్ని చాటుకున్నారు.

కూటమి విజయంతో పాదయాత్ర

ఆత్రేయపురం, జూన్ 16: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, కొత్తపేట ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు విజయం సాధించడంతో అంకంపాలెం సర్పంచ్ ముత్తాబత్తుల రాజు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన దళిత నాయకులు సోమవారం పాదయాత్రగా గౌరీపట్నం బయలుదేరివెళ్లి మొక్కు తీర్చుకున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి కరుటూరి నరసింహారావు పాదయాత్రను ప్రారంభించి సంఘీభావం తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

రావులపాలెం, జూన్ 16: ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా రైతులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈదల శ్రీనివాస్‌చౌదరి కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏహెచ్ఏ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు జంగా రాజేష్ అధ్యక్షతన ఆదివారం రావులపాలెంలో జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాస్‌చౌదరి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం విధి విధానాలను అమలు చేయడంతో పాటు రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు మెరుగైన వైద్య సేవలందించే విధంగా ఉద్యోగులు పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి మోటూరి రామారావు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు

మండపేట, జూన్16: మండపేటలో ఉన్న భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు ఈనెల17నుంచి 20వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి వీరవెంకట సత్యనారాయణ తెలిపారు. 17నస్వామి ఊరేగింపు, రాత్రికికల్యాణం, 18నఊంజల్‌సేవ, 108కిలోల పులిహోరతో తిరుప్పావడసేవ, 19నస్వామివారికి పంచామృతాలతో అభిషేకం, 20నస్వామివారికి శ్రీపుష్పయాగంనిర్వహిస్తామన్నారు. అతిథులుగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హాజరవుతారన్నారు.

మహాగజమాల యాత్రను విజయవంతం చేయండి

మామిడికుదురు, జూన్ 16: బాలబాలాజీ కల్యాణోత్సవం రోజున ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి దంపతులకు సమర్పించే గజమాల యాత్రను విజయవంతం చేయాలని శెట్టిబలిజ సంఘ మండల అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్ కోరారు. మామిడికుదురులోని బీసీ సామాజిక భవనంలో జరిగిన శెట్టిబలిజ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాటిపాకలోని తాలూకా శెట్టిబలిజ సంఘ భవనం నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు గజమాల యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. జగ్గన్నపేట, నగరం, మామిడికుదురు, పాశర్లపూడి మీదుగా అప్పనపల్లికి యాత్ర జరుగుతుందని, శెట్టిబలిజ సోదరులు, రామస్వామి అభిమానులు యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వాసంశెట్టి శంకరరావు, నయినాల సత్యనారాయణమూర్తి, పెచ్చెట్టి సత్యచంద్ర, కడలి నూకరాజు, నయినాల రామకృష్ణ, బొక్కా వెంకటేశ్వరరావు, యాండ్ర వీరబాబు, నయినాల కాశీ, అనుచూరి శ్రీను, జోగి రామకృష్ణ, బొంతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం, జూన్ 16: వెలిచేరుకు చెందిన తిరుమలనాధుని రామచంద్రరావు(38) ఎరువుల షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. అతడిని కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆలయంలో చోరీ

ముమ్మిడివరం, జూన్ 16: కొత్తలంకలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు ప్రధాన గేటుకు ఉన్న తాళాలు బద్దలకొట్టి ఆలయంలోకి ప్రవేశించి, హుండీని తెరిచి అందులో ఉన్న రూ.40వేలను అపహరించుకుపోయారు. ఆదివారం ఉదయం ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముమ్మిడివరం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు



ఆత్రేయపురం, జూన్ 16: పురాణ ప్రసిద్ధి గాంచిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి, కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామివార్ల వార్షిక దివ్య కల్యాణోత్సవాలను సోమవారం నుంచి వారం పాటు ఘనంగా నిర్వహించనున్నట్టు ఈవోలు తెలిపారు. సోమవారం సాయంత్రం 6.30గంటలకు వాడపల్లి వేణుగోపాలస్వామి దివ్య కల్యాణం జరుగుతుందని, దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశామని ఉపకమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. ర్యాలిలో వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం అంకురార్పణ, ధ్వజారోహణ, కల్యాణం, 19న సదస్యం, 21 చక్రస్నానం, పూర్ణాహుతి, 22న పుష్పోత్సవం జరుగుతాయని ఈవో కృష్ణచైతన్య చెప్పారు.